కన్నీటి తొలకరి

శ్రీ అయ్యగారి విశ్వేశ్వరరావు B. A.,

వీరకుంకుమ దిద్ది _ కర్పూరనీరాంజనం యిచ్చి "విజయ విలాసంతో విచ్చేయండి!" అంటూ ముసి ముసి నవ్వులతో సుశీలాదేవి తన భర్త ప్రతాపసింహుని సాగనంపుతూంది కదనరంగానికి. బోసి నవ్వులతో పాల బుగ్గలు క్రిక్కిరిసిపోతున్నాయి పసిపాప బాల చంద్రుడికి. పట్టపగ్గాలు లేని బాహుబలసంపన్నుడు ప్రతాపసింహుడు కాలుకదిపాడు - విద్రోహవిధ్వంసకి - విశ్వమానవ కళ్యాణానికి.

ఆ రోజుల్లో థగ్గులు - పిండారీలవంటి దొంగల గుంపులు దేశాన్ని కలచి కలవరపెడుతున్నాయి. మానవతుల మానమూ - ధనవంతుల ధనమూ - అమాయకప్రజల సౌఖ్యమూ ఆమాయదారుల చేతుల్లో భస్మమై పోతున్నాయి. శాంతీ - భద్రతా సంతల పాలయ్యాయి. వూరు దాటితే భయం! వూళ్లో నేభయం!! ఇంతెందుకు? ఇంట్లో నేభయం!!! తల్లి చూస్తూండగానే బిడ్డలహత్య. భర్త కళ్ళెదుటే భార్యకు మానభంగం. పట్టపగలే నిలువు దోపిడీలు. ఇంకేంకావాలి? ఆనాటి ప్రజల అశాంతిమయ జీవితంలోని అగచాట్లు ఆ దేవుడికే తెలియాలి?

ఏ వీరుడైనా - కంకణంకట్టుకొని - యీ హింసామూర్తుల్ని చించి చెండాడి - వాళ్ళ మాంసఖండాల్ని కాకులకూ గ్రద్దలకూ తీయని తేనీటి విందుచేయడా? అని ప్రజలు వుట్టుడికి పోతున్నారు. ఎవళ్లకీ ధైర్యం చిక్కకుండావుంది. ప్రాణాలు ఎంతైనా తీపికదూ! ఎవరూ ముందంజవేయటంలేదు.

ఏమైనాకానీ! ప్రాణాల్ని దేశసేవకు బహుమానం చేస్తాను. నా నడిగడ్డలో నర్తన సాగిస్తున్న యీ వినాశకారుల్ని అంతంచేయాలి. అధర్మజ్వాలని ఆరిపి తీరాలి _ అని నిశ్చయించుకొన్నాడు ప్రతాపసింహుడు. పిరికి నెత్తురులేని తదితర శూరులంతా అతని నిశ్చయానికి అండగా నిలబడ్డారు దొంగల ముఠాని క్రుంగదీయడానికి ముందంజవేశారు

కదనరంగానికి సపరివారంగా పోయేముందు ప్రతాపసింహుడు సుశీలాదేవి గడ్డాన్ని ఎడమచేతితో పట్టుకొని - కుడిచేతితో బాలచంద్రుడి పాలబుగ్గల్ని నిమురుతూ - యిలా అన్నాడు.

"సుశీలా-యిది సమరయాత్ర - చావు బ్రతుకుల ఉయ్యాల. వస్తే విజయశ్రీతో, చస్తే వీరస్వర్గంలో. ఏదైనా సంతోషమే. ఏది యెలా సంఘటించినా అధైర్యపడకు. భావిపౌరుడు - మన బాలవీరుడు-జాగ్రత్త" అంటూండగానే సుశీలాదేవి వీరకుంకుమ దిద్దింది. కర్పూర నీరాంజనం యిచ్చింది. ప్రతాపసింహుని సాగనంపింది.

దేశం అంటే మట్టి కాదు. మట్టిమీదవున్న ప్రజలే దేశం. ప్రజలన్నా దేశమన్నా తేడాలేదు. పౌరుషం-త్యాగంతో వర్ధిల్లే ప్రజలే మట్టికి ప్రాణం పోస్తారు; జాతికిజవజీవాలు పోస్తారు. అవసరమయితే-జాతీయ సౌఖ్యంకోసం - స్వేచ్ఛకోసం — శాంతికోసం_తమ ప్రాణాల్ని బలిదానంచేస్తారు. జాతీయచరిత్రలో వారి త్యాగమయ గాథలు సువర్ణాక్షర లిఖితం - ఈ కోవకి చెందిన ఉత్తమ పురుషుడు ప్రతాపసింహుడు.

పతికి పౌరుషం ప్రేరేపిస్తారు _ నిజమైన వీరపత్నులు. వీరవిహారం చేసి_భర్త ప్రపంచ ప్రఖ్యాతిని సముపార్జించాలని ఆకాంక్షిస్తారు ఆ అనుపమాన సౌశీల్యవంతులు _ స్వార్థపరత్వం లవలేశమూలేని స్తవనీయ చరితలు! పిరికిపందలాగ - భర్త తిరోగమనం సాగించడం సహించలేని మాన్యమహిళలు. ఈ లాంటి త్రోవని పోయే ఉత్తమోత్తమ ధర్మపత్ని_సుశీలాదేవి! ప్రతాపసింహునికి తగిన ఉజ్జీ!

సింహం కడుపున చీంబోతు పుడుతుందా — చెప్పండి! అటువంటి జగజెట్టికి — ఇటువంటి వీర పత్నికి — పుట్టిన బాలచంద్రుడు మాత్రం తక్కువా?

ఇంటాబయటా — యిలాగ జేజేలు స్వీకరించి — పెద్దల చల్లని దీవనల్ని శిరసావహించి — దేశక్షేమం కోసం—ప్రతాపసింహుడు శత్రువుల్ని చించి చెండాడడానికి బయలుదేరాడు.

కంటికగుపించేవరకూ చూస్తూనేవుంది సుశీలాదేవి తన భర్తనీ ఆ వీరపరివారాన్నీ. ఇంక ప్రతాపసింహుడు కనపడటంలేదు. అతని అనుచరులూ కనపడటంలేదు. ఒకసారి — సుశీలాదేవి ముద్దుబిడ్డవైపు చూసింది. అలా చూస్తూంటే — బాలచంద్రుడు ఫక్కున నవ్వుతున్నాడు. ఆ ముఖంలోనే ప్రతాపసింహుని ప్రతిబింబం సుశీలతో దోబూచులాడుతూంది. సగర్వంగా ఇంట్లోకి పోయింది ఆయిల్లాలు. ఎదురుగా వుంది భర్త చిత్రం. ఆ ప్రక్కనేవుంది విజయలక్ష్మి విగ్రహం. సుశీల - మెడలోవున్న మంగళసూత్రాల్ని తీసి కళ్లకద్దుకుంటూండగా కుడికన్ను ధణదణా అదిరింది. వెంటనే భర్త చిత్రానికి నమస్కరించింది. లక్ష్మి విగ్రహానికి అంజలించింది. పతిభక్తి - దైవభక్తి ఆవిడకి ఆభరణాలు.

రోజులు గడుస్తున్నాయి గబగబా, కాని అందరికీ అలావున్నా సుశీలాదేవికి చాలా భారంగా వున్నాయి. సూర్యోదయం అయితే — సూర్యాస్తమయం వరకు నిరీక్ష. సూర్యాస్తమయం అయితే సూర్యోదయంవరకూ నిరీక్ష. ఈ నిరీక్షణలో ఎలాటి వార్తలు చెవిలో పడతాయోననే బెంగ!

ప్రజలంతా చెప్పుకుంటున్నారు. ప్రతాపసింహుని సాహసాన్ని మెచ్చుకుంటూ. దొంగలు చాలామంది లొంగిపోయారని వార్తలు వినిపించేసరికి — హమ్మయ్య యినాళ్లకి విన్నాం చల్లనికబురు అని ఆనందపరవశులవుతున్నారు ఆ పౌరులు.

ప్రతాపసింహుని బల పరాక్రమ వర్ణనలు - మాయదారి దొంగల మరణవార్తలు — శాంతిభద్రతలకు ఇంక ఎలాంటి భయమూలేదనే మాటలూ — తెగవినిపిస్తున్నాయి సుశీలాదేవికి. అంతా — ఎంత అదృష్టవంతురాలవమ్మా — అలాంటి వీరుని పెళ్లాడిన సౌభాగ్యం నీదేనమ్మా — ఎంత పూజ చేశావో యీ పుణ్యపురుషుణ్ణి చేపట్టడానికి అంటూ అమ్మలక్కలు మెచ్చుకుంటూంటే తన అదృష్టాన్ని తలుచుకొని లోలోపల మురిసిపోతూంది సుశీల!

మరికొందరు బాలచంద్రుడి బుగ్గలు సాగదీస్తూ! అదుగో మీనాన్న — విజయభేరి మ్రోగిస్తూవస్తున్నారు. నీవెన్ని వూళ్లేలుతావో? అంటూంటే సుశీల పొందే ఆనందానికి హద్దూలేదు పద్దూలేదు.

మరి రెండు రోజులనుంచి యేవార్తలూ వినిపించటంలేదు. అప్పుడే తలుపు చప్పుడు. గుఱ్ఱపు డెక్కలచప్పుడుకూడా. ఎవరోవచ్చి పిలుస్తున్నారు. ఆదేమీ కొత్త కంఠంకాదు. ఏంవార్త వినాలో అని గుండెలు ఆతురతతో కొట్టుకుంటున్నాయి. కాళ్ళు దడదడలాడుతున్నాయి ఎందుకో! ఆ పరిస్థితిలోనే సుశీలాదేవి తలుపుతీసింది. తలుపు తీసి చూసేసరికి ఎవరు? ఇంకెవరు —. అమరసేనుడు. ప్రతాపసింహునికి కుడిభుజం.

'అమరసేనా! అయ్యగారికి క్షేమంకదా'—అంది సుశీలాదేవి — తక్షణ సమాధానం అపేక్షిస్తూ. సందేహమా? తల్లీ — క్షామాన్ని మటుమాయంచేసిన జగజెట్టికి క్షేమలోపం వుంటుందటమ్మా! అన్నాడు హుందాగా అమరసేనుడు.

ఈ మంచి మాటల్ని విని — బాబూ అని పట్టరాని బ్రహ్మానందంతో సుశీలాదేవి ముద్దుబిడ్డ బాలచంద్రుణ్ణి గట్టిగా ముద్దెట్టుకుంది. మంగళసూత్రాల్ని కళ్ళకద్దుకుంది. భర్త పటానికి అంజలించింది. లక్ష్మి విగ్రహానికి కైమోడ్పు లర్పించింది. ఇంకేం చెబుతాడోనని అమరసేనునివైపు చూచింది.

ప్రతాపసింహవీరుడు విజయభేరీలతో విచ్చేస్తున్నారమ్మా! తగిన విధంగా ఆ వీరవరేణ్యునికి సన్మానంచేసే బాధ్యత యీ పౌరులిది. ఈ సమా

చారం ముందుగా చెప్పాలని వచ్చానమ్మా. సన్మాన సభాసన్నాహాలు — సముచిత కార్యక్రమాలు చాలా వున్నాయి. శెలవిస్తాను తల్లీ — శెలవు అంటూ నమస్కరించి అశ్వారూఢుడై అమరసేనుడు వెళ్ళిపోయాడు.

సుశీలాదేవి చెవిలో అమరసేనుని అమృత వాక్యాలు — మధురరసాల మాటల మూటలు — అస్తమానం మరుపులేకుండా మార్మ్రోగుతున్నాయి మురుపులు కురిపిస్తూ. బెంగ ఎలా కుంగదీసి ఏనుగంత వారిని పీనుగగా చేస్తుందో సంతోషం సగంబలం తెచ్చి వాడిన తీగకు నవవసంతాన్ని తెచ్చిపెట్టదా మరి.

♦ ♦ ♦

ఇన్ని దేశాలనీ — ఇంతమంది ప్రజల్నీ హింసించి హింసించి ఆహింసాకాండలో ఆనందోపాసన సాగిస్తున్న చోరనాయకుడు వీరబాహుడు బలే జిత్తులమారి. ప్రతాపసింహుని తడాఖాకి తట్టుకోలేని తన పరివారమంతా ఎలా దాసోహం అని దణ్ణాలెట్టి దాసానుదాసులై బందీలయిన కథ అంతా తన కళ్ళముందే జరిగింది. అభుళ్ళు అతనివికావు. నోరెత్తితే తనకీ అనుచరులగతి కాక మరేంవుంది? ఓడిపోయినట్లు నటించి — ప్రతాపసింహుని కళ్ళుకప్పేసి — ఆ మోసకారి చోరనాయకుడు హఠాత్తుగా పలాయనం సాగించడం మొదలు పెట్టాడు. ఆ పిరికిపందని మృత్యు నీడలాగ వెన్నంటుతూ పోయాడు ప్రతాపసింహుడు. పత్తాలేకుండా పారిపోయాడు వీరబాహుడు. 'పరివార శూన్యుడైన వీరబాహుడూ — నీటిలోంచి బయటపడిన మొసలీ వొక్కటే అన్నారు' ప్రతాపసింహుని అనుచరులు.

దొంగల భూమ్యాంతరగృహం ప్రతాపసింహుని చేజిక్కింది. ఆ భవనాన్ని చూసి ప్రతాపసింహుడు ఆశ్చర్యపడ్డాడు. చేసేది దొంగతనం అయినా — ఆ దొంగలు అనుభవించేది యింత ఐశ్వర్యమా? ఇంత భోగమా? ఎవరికుంటుంది యింతదర్జా! అనుకున్నాడు. ఒక్కొక్క నగని చూసి ఎంతో బాధపడ్డాడు ప్రతాపసింహుడు. ఈనగని ఎంత అవస్థపడి ఏ నిజాయితీపరుడు చేయించుకున్నాడో? దొంగల పాలయిన ఆనగను తలుచుకొని తలుచుకొని — 'ఏమయిందో నా కష్టార్జితం?' అని పరితపించిన మందభాగ్యుడెవరోగదా!' అని చాలా జాలిపడ్డాడు. ఈ నగలు ఎందర్ని వుసూరుమనిపించాయో! మరెందరి కొంపలు కూల్చాయో! ఇంకెందరి జీవాలు తీశాయో! ఆహా! ఒకరి విచారమే మరొకరికి సంతోషాన్ని కల్పించడం ప్రపంచంలో పరిపాటి! యిలా ఆలోచిస్తూ ఉద్రిక్తుడై పరివారానికి ప్రతాపసింహుడు యీ విధంగా అన్నాడు.

'ఇదంతా చోరధనం. కునాయాసంగా సంపాదించబడిన చోరధనం. ఎత్తండి దీనినంతా మన సంచులలోకి. కళ్ళులేని కబోధులకీ — కాళ్ళులేని కష్టజీవులకీ కుళ్ళికృశించిపోయే కుష్టురోగులకీ — ఆర్తనాదం చేసే అభాగ్యులకీ పంచుదాం. నిరతాన్నదానం బీదలకు చేసే అన్నసత్రాలను కట్టిద్దాం. ఎత్తండి దీనినంతా మనసంచులలోకి—' అని అంటూండగానే పరివారం అన్నంతపనీ ముగించారు.

'ఒక్కొక్క దొంగని కుంగదీసి — కాళ్ళూ చేతుల్నీ విరిచికట్టి — కొరడాలతో వీపు చిట్లేటట్టు చావమోదండి. మానవులైనా పశుబలం ప్రయోగించి — సాటి సోదరప్రపంచాన్ని హింసించిన యీ నరరాక్షసులమీద జాలి చూపనక్కర్లేదు. ఎందరి ప్రాణాల్ని తీశారో యీ పరమనీచులు — వీళ్ళందరి ప్రాణాల్నీ ఒకేసమయంలో తీసినా పాపంలేదు. దుర్మార్గులకి హింసాఫలం యిలావుంటుందనే బుద్ధి వచ్చేటట్లు చేయండి—' అన్నాడు ప్రతాపసింహుడు. కొరడాదెబ్బలకు తట్టుకోలేని ఆ చోర పరివారమంతా — నీళ్ళులేక ఎండకి ఎండిపోయిన మొక్కలాగ — నిరాహారంగా — నీరసంతో — బరువుగా — ప్రాణాలు వదలారు. ఎవరికీ జాలికలిగించని వారి దుర్మరణగాథని వేడుక చేసుకున్నారు అక్కడివారు.

♦ ♦ ♦

విజయనినాదాలతో - వీరభేరీ మ్రోతలతో వీర ప్రతాపసింహుడు రాచఠీవితో గృహోన్ముఖుడయ్యాడు. పరివారం జోహారు చేస్తోంది. పురజనులు ఎదురు చూస్తున్నారు - యీ శాంతిదూతని ఆరాధించడానికి. ఎదురు సన్నాహాలతో మంగళవాద్యాలు - మారు మోగుతున్నాయి. పచ్చని తోరణ పంక్తులు కిలకిలలాడుతూ ఉయ్యాలలూగుతున్నాయి.

'ఆ కీచకుల మదమడచిన ఆ ప్రతాపసింహుడు యింకా ఎప్పుడువస్తాడే?' అనుకుంటూ అంతఃపురాలలోంచి మేలిముసుగులలో ఎదురుచూస్తున్నారు ఘోషా స్త్రీలు.

'వాడి కడుపు చల్లగా! ఆ దొంగల్ని సమూలంగా సర్వనాశనంచేసిన ఆ ప్రతాపసింహుడు పదికాలాలు వర్ధిల్లాలి' అన్నారు ముత్తైదువలు. 'అలాంటి భర్తని పెళ్ళాడిన సుశీలాదేవి ఏబంగారు పూలతో పూజచేసిందో కదా!' అంది ఒకామె. 'ఔనమ్మా - పూజకొద్దీ పురుషుడన్నారు. మా వారూ వున్నారు - దొడ్లోదొంగ వున్నాడండీ' అన్నా, 'వొద్దే - రాత్రిళ్ళు దొంగలమాట తలపెట్టకు. వాడికి కావలసినంత పట్టుకుపోనీ - మన ప్రాణాలు మనకి మిగిలిపోతే చాలు' అంటారమ్మా ఏంచెప్పను - ఆయన పిరికితనం అలా అఘోరించబట్టే ఇంటెడు ఆస్తీ ఎగిరిపోయింది - అని కన్నీళ్ళు గుక్కుకుంటూంది యింకో ఆమె. ఇలాగ పదాలు దొంగతనాలు - సాహస దొంగతనాలు - కథలుగా చెప్పుకుంటూ ఆ దొంగల పాపం యిన్నాళ్ళకి గదా భళ్ళున బ్రద్దలయింది అంటూ వ్రేళ్ళు విరుస్తున్నారు అక్కడివారు.

వూరేగింపుతో - ప్రజల మెప్పుల కుప్పగా - భర్త విజయవిలాసంతో బయలుదేరి వస్తున్నారని విని సుశీలాదేవి ఎంతో సంబరపడింది. నిజంగా - ఆనాటి తన శుభాకాంక్ష - ఆ కర్పూర నీరాంజనం - ఆ వీరతిలకం - సార్థకమై - సత్ఫలాన్ని సమకూర్చినందుకు సుశీలాదేవి బ్రహ్మానందపడింది. అంతా హారతి పళ్ళేలతో నిలిచివున్నారు నీరాంజనాలీయడానికి.

◆ ◆ ◆

ముందు మంగళవాద్యాలు, తరువాత ఆనంద నృత్యాలు, ఆతరువాత పరివారం ప్రతాపసింహునికి జై! అనే వీరాశ్వకాలు. ఆ మధ్యనే అలంకరింపబడిన ఏనుగు, పట్టు పరుపుమీద - పూలదండలతో - మునిముని నగుమోముతో - ఆసీనుడై వున్న ప్రతాపసింహుడు. ఎడాపెడా రక్షకభటులు. ఆ వెనుక వీరసైనికదళం. అంతా ఆనందోత్సవం, నరకాసురుని వధించి - దీపావళి చేసుకున్నట్లుగా - ప్రతి ముఖంలోనూ - అమానవరాక్షస వంశనాశనకారణంగా మెరిసే మురిపించే నవీనకాంతులు; జీవిత భారాన్నే మరపించే ఆనందజ్యోతులు!! ఆహాహా! ఆవూరేగింపు అందర్నీ దరహాసపరవశుల్ని చేస్తూ - హాయిగా సాగుతూంది పెళ్ళినడకలాగ.

ఎవరనుకొన్నారు? హఠాత్తుగా వూరు చేరక ముందే - కొంచందూరంలోనే ఆవూరేగింపు అలా ఆగిపోతుందని ఎవరనుకొన్నారు? ఎందుకూ అలా ఆగిపోయింది? ఎవరూ? ముందుకు పోవటం లేదే. మంగళవాద్యాలు మూగవడ్డాయి. వైతాళికుల గొంతుకలు మూతపడ్డాయి. అంతటి ఆనంద యానం ఏ గంగలో కలిసింది? అయ్యో! అందరూ అంత కంగారు పడతారెందుకు? ఒక్కరూ ఏంజరిగిందో చెప్పరేమిటి?

అదిగో - అంతా ఆ ఏనుగదగ్గర గుమిగూడుతున్నారు. ఆతురతతో తొంగి తొంగి చూస్తున్నారు ఏనుగు నడవటంలేదు. ఎంచేత? అక్కడేదో ప్రమాదం జరిగిందా? ఆ జనసమూహంలో ఆతురత ఎక్కువయిందే. "పట్టుకోవాలి రండి - వెతుకుదాం." అంటూ కొందరు కత్తులతో - కఠార్లతో పోతున్నారు. ఏనుగమీదనుంచి ఒక వ్యక్తిని మెల్లిగా క్రిందకుదించుతున్నారు గంజీకావడికట్టి, అతడెవరు? మావట్టీడా? ఒక పదునైన కత్తి కంఠంలోంచి

దూసుకుపోయింది. శరీరమంతా రక్తమయం. అలాగ నెత్తుటివరదలపాలయిన అవ్యక్తి ఎవరు? ఇంకెవరు? ఈ ఆనందోత్సవానికి కారకుడు. దుష్టశిక్షణ - శిష్టరక్షణ చేయడానికి కంకణంకట్టుకొని - శాంతి స్థాపనకు ముందంజవేసిన సౌశీల్యమోహనుడు - శౌర్యా! మన ప్రతాపసింహుడు. ఎవరింతటికసికట్టి అసిధారకు ఆహుతి చేసింది? ఎవరీ పుణ్యమూర్తిని గాయపరచినది? ఈ విజయోత్సాహాన్ని ఈ వీర పూజనీ చూడలేక - దేవుడేకళ్లుకట్టుకొని - యింతటి దురంతాన్ని ప్రేరేపించాడా? ఈ ఆకస్మికప్రమాదానికి కారకులు - ప్రేరకులు - ఆ మోదకులు ఎవరైవుంటారు? మాట - మంతిలేక మగతలో పడి వున్నాడే ప్రతాపసింహుడు! సరసం విరసం అయింది. చూస్తుండగా నిండు పున్నమి వెన్నెల మటుమాయమై గాఢాంధకారం కమ్మేసింది. అంతంలేని ఆనందం అంతంలేని చింతగా మారింది!

ఎదురుచూచే ఇల్లాలికేదిదారి? ఈ త్యాగరాయని మంగళ విగ్రహాన్ని మనసారా దర్శించి - కృతజ్ఞత వెలిబుచ్చుకోవాలని - ఎంతసేపటినుంచో నిలిచి నీరాంజనాలను ఇయ్యడానికి ఎదురుచూచే ఆ అమాయక పౌరులతో ఏంచెప్పేది! ఘడియ ఘడియకూ అందరికీ ఆతురత పెరుగుతోంది. ఇంతమంది పుర జనుల ప్రాణాలను కాపాడిన యీ త్యాగరాజు ప్రాణాల్ని - ఎవరూ నిలబెట్టలేరా? ఈ పావన జీవనజ్యోతి యిలా చల్లారిపోతూంటే ఎవరికీ రక్షించే ఉపాయం తట్టలేదా? అని అందరూ అనేక విధాల తహతహపడుతున్నారు.

అంతలోనే మళ్ళీ అలజడి, గుఱ్ఱాల డెక్కల చప్పుడు. "పరమనీచుడు వీడే!" అనే ఘాటు మాటలు, ఆ మాటల ధాటిమధ్య - ఆ వేడి చూపుల మధ్య - అందరిచేతా - అన్ని విధాలా - చెంప కాయల లగాయతు పేపబెత్తం దెబ్బలవరకూ తింటూ - అనరానిమాటల్ని - వినలేని దూషణల్ని విధిలేక వింటూ - పలాయనం సాగించడానికి మరో దారిలేదని కుంగిపోతూ - తనంతటతానే చావడానికి సాధనం దొరకకపోవడంవల్ల తల్లడిల్లుతూ - బ్రతికి వుండీ చచ్చిన శవంలాగవున్న ఒక వ్యక్తి వస్తున్నాడు. ఎవడీవ్యక్తి? అనే ప్రశ్నార్థకమైన వీక్షణాలు. 'ఎవడా! వీడే - మన ప్రతాపసింహుని ప్రాణాల్ని బలిగొన్న మానవరాక్షసి' - అనుకుంటున్నారు కొందరు. ఆ! అంటూ అంతా అతనివైపు చూశారు పగబట్టి బుసకొట్టే పాములలాగ, ఆ కోపాల చూపులలో ఎన్నో శాపాలు వర్షించినయి.

సరిగ్గా - యిదే సమయానికి ప్రతాపసింహుడు తుదిసారి వూపిరివదిలాడు. ఆ కీర్తిమూర్తి భౌతిక దేహాన్ని బంగారు జలతారు శాలువాతో కప్పారు. మళ్ళీ ఆ ఏనుగుమీదవున్న అంబారీలో వుంచారు. అందరి ముఖాలలోనూ ముఖారిరాగనీడలే.

ఇంతవరకూ ఎంతో ఆనందించాం. ఇంక మన ఆనందం మట్టిపాలయింది. ఆనందం చూస్తూండగా వికారరూపాన సాక్షాత్కరించింది. విచారం మనకి దాపురించింది. ఇక యేడుద్దాం. ఏడుపురాగాలు తీయండి. ఏడుపుముఖాలు పెట్టండి. ఏడుపుచూపెట్టండి. మనకి శాంతిభిక్ష పెట్టిన - మనత్యాగ రాజు మనకింకలేడు. అదుగో! అలాచూడండి! ఆ మనిషివైపు చూడండి. బంధీభూతుడైన ఆ మానవ రాక్షసిని చూడండి. వీడే చోరనాయకుడు. వీర బాహుడు! పిరికిపందలాగ పరారీ అయిన దొంగల దొర! చాటు మాటున పొంచివుండి - పదునుకత్తిని గురిచూచి ఘాటుగావదిలిన క్రూరుడు. కసిదీర్చుకొన్న కఠినకంఠుడు! మనప్రతాపసింహుని కడుపున బెట్టుకొన్న కిరాతకుడు - పొగరుతో ఎంత ఎగిరితేనేం - చివరకు మన చేజిక్కిపోయాడు. వీడి పంచ ప్రాణాలూ మీ అందరిచేతుల్లో వున్నాయి. ప్రతాప సింహుని ప్రాణాలు తీసిన వీడి ప్రాణాల్ని - తేలికగా మీరు తీయచ్చు, నేరస్థుణ్ణి సజీవంగా మీ యెదుట పెట్టడమే నా బాధ్యత. ఈ హంతకునికి యెలాంటి శిక్ష విధించాలో ఆలోచించండి - మనమే కాకుండా మనతరతరాలవారుకూడా మరిచిపోలేని శాంతిదానం మనప్రతాపసింహుడు మానవజాతికి చేసి తనువు చాలించాడు.

(సశేషము)